క్లుప్తంగా

జెడ్పీటీసీ పరామర్శ



కుటుంబరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ లీలానవకాంతం గంగరాజు

దెందులూరు: కేఎస్ పురం వైఎస్సార్ సీపీ సీనియర్ నేత సరిపల్లి కుటుంబరావు మరణం పార్టీకి తీరనిలోటని జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు అన్నారు. బుధవారం ఖండ్రికనర్సింహాపురంలో కుటుంబరావు ఇంటికెళ్లి ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యుల పరామర్శించారు. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కనికెళ్ల పెద్దిరాజు, నాయకులు మాండ్రు మధుబాబు, చిలకా హరీష్, మానవహక్కుల సంఘం అధ్యక్షుడు కనికెళ్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి



వల్లూరులో సమావేశమైన సర్పంచ్‌లు

గణపవరం: గ్రామాలలో కనీస వసతులైన మంచినీరు, ఫిల్టర్‌బెడ్స్ మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన నిధులు మంజూరు చేసి, సమస్యల పరిష్కారానికి సహకరించాలని గణపవరం మండల సర్పంచ్‌ల చాంబర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బుధవారం సాయంత్రం గణపవరం మండలం వల్లూరులో మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు ముచ్చర్ల వేణు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. శ్మశాన వాటికల అభివృద్ధి, చుట్టూ ప్రహరీలు, రోడ్ల నిర్మాణం, పాడైన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటుచేయాలని, కచ్చా డ్రెయిన్లు తవ్వించేందుకు నిధులు విడుదల చేయాలని తీర్మానించారు. సమావేశంలో సర్పంచ్‌ల చాంబర్ సభ్యులు, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రథమం



విజేతలతో ఉపాధ్యాయులు

గణపవరం: అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తణుకు చిట్టూరి ఇంద్రయ్య కళాశాలలో ఈనెల 9న జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో గణపవరం బాలుర ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి అఖిల్ శ్రీవర్మ ప్రథమ స్థానంలో నిలిచినట్టు పీడీ పద్మావతి తెలిపారు. 600 మీటర్లు, 60 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానాలు సాధించి ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆమె తెలిపారు. విద్యార్థి అఖిల్ వర్మను హెచ్‌ఎం ఎంఎస్ఎస్ మూర్తి, ఎస్ఎంసీ చైర్మన్ నిర్మల కుమారి,, ఉపాధ్యాయులు అభినందించారు.

సీమంతాలు, అన్నప్రాసనలు



దెందులూరులో సీమంతాలు నిర్వహించిన దృశ్యం

దెందులూరు: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా దెందులూరు గ్రామంలో 14 మంది గర్భిణులకు సీమంతాలు, ఏడుగురు చిన్నారులకు అన్నప్రాసనలు చేయడం సంతోషంగా ఉందని ఐసీడీఎస్ పెదపాడు సీడీపీఓ విజయలక్ష్మి, దెందులూరు ఎంపీడీఓ వి.శ్రీలత అన్నారు. బుధవారం దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఏలూరు సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టెమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల అసోసియేషన్ అధ్యక్షురాలు రంగమ్మ ఆధ్వర్యంలో సీమంతాలు, అన్నప్రసన కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సర్పంచ్ తోట ఏసమ్మ సూచించారు.

శానిటేషన్ సిబ్బందిని వెనక్కు తీసుకురావాలి

ఏలూరు (టూటౌన్): విజయవాడ బుడమేరు వరద ముంపు సహాయ పనులు నిమిత్తం ఏలూరు నుంచి 10 రోజుల క్రితం పంపిన పారిశుద్ధ్య కార్మికులు 500ని మందిని వెంటనే వెనక్కి రప్పించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఏలూరు నగర కమిటీ కోరింది. ఈ మేరకు నగర కమిటీ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భాను ప్రతాప్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఏలూరు నుంచి వెళ్లిన కార్మికులు, సిబ్బంది అక్కడ అనేక అవస్థలు పడుతున్నారని యూనియన్ నాయకులు పేర్కొన్నా రు. అక్కడ సిబ్బందికి సకాలంలో టిఫిన్లు, భోజనాలు అందడం లేదని తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనులు చేయిస్తున్నారని వివరించారు.

కొల్లేరులో పెరుగుతున్న వరద

- ఆందోళనలో కొల్లేరు తీర గ్రామాల ప్రజలు
- ముంపు నుంచి చేలను రక్షించేందుకు రైతుల పాట్లు



నిడమర్రు : ముంపునీటిని ఇంజన్లతో పంట బోదె నుంచి పక్కకు తోడుకుంటున్న అడవికొలను రైతులు

నిడమర్రు: వరుణుడు కరుణించినా.. రోజు రోజుకు కొల్లేరు సరస్సులో వరదనీటి మట్టం పెరుగుతుండటంతో కొల్లేరు తీర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మంగళవారంతో పోల్చితే బుధవారం కొల్లేరు నీటి మట్టం అరమీటరు పెరిగింది. ప్రస్తుతం కొల్లేరు సరస్సు నీటి మట్టం 3.5 మీటర్ల వరకు ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. బుడమేరు, రామిలేరు. తమ్మిలేరు, పెదపాడుతో పాటు మండలానికి చెందిన తోకలపల్లి డ్రెయిన్ల నుంచి కొల్లేరుకు మిగులు జలాలు వచ్చి చేరడంతో వరద ఉధృతంగా ఉంది. కొల్లేరు సరస్సులోని మిగులు జలాలను అధికారులు ఉప్పుటేరుకు మళ్లించేవారు. అయితే ఆకివీడు, కాళ్ల, భీమవరం, మొగల్తూరు తదితర ప్రాంతాల్లో ఆక్రమణల వల్ల ఉప్పుటేరులో వరద నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడుతోంది. దీంతో కొల్లేరుకు వెళ్లే పంట బోదెలు, కాలువలు ముంపునీటితో ఎగదన్నడంతో మండలంలోని అడవికొలను, తోకలపల్లి, భైనేపల్లి, ఆముదాలపల్లి, చానమిల్లి, క్రొవ్విడి, పెదనింద్రకొలను గ్రామాల్లోని వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆయా గ్రామాల్లోని రైతులు వరి చేలు ముంపు బారిన పడకుండా బరకాలు ఉపయోగించి చేలు, కాలువల గట్లు ఎత్తు పెంచుకుంటున్నారు. గత రెండు రోజులుగా అడవికొలను గ్రామంలో పంట బోదెల్లో వరద నీరు పెరుగుతుండటంతో ఆయా రైతులు అప్రమత్తమై పంటను రక్షించుకునే పనుల్లో నిమగ్నమయ్యారు.



నిడమర్రు : పంటబోదె నుంచి ఎగదన్నుతున్న ముంపునీటి కాల్వ గట్టును ఎత్తు చేస్తున్న రైతులు



భీమడోలు : బద్రికోడు వద్ద ఇళ్ల ఎదుట రోడ్డుపై నిలిచిన నీరు

గ్రామాల్లోకి ఎగదన్నుతోన్న కొల్లేరు వరద

భీమడోలు: కొల్లేరులోకి చేరే ముంపు నీరంతా గ్రామాల్లోకి ఎగదన్నుతోంది. కొల్లేరును ఆనుకున్న గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పలు గ్రామాల్లో రోడ్లపై నీరు ప్రవహిస్తోంది. ఇక్కడ పశుపక్ష్యాదులను వదిలి బయటకొచ్చేందుకు స్థానికులు ఆసక్తి చూపడంలేదు. ఎగువన కురిసిన భారీ వర్షాలకు వరద నీరంతా తమ్మిలేరు, ఎర్రకాలువ నుంచి డ్రెయిన్ల ద్వారా కొల్లేరులోకి చేరుతోంది. రెండు రోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టినా, తమ్మిలేరు నుంచి వచ్చే వరద నీరు చెట్టున్నపాడు పంచాయతీ శివారు మల్లవరం నల్లకోడు డ్రెయిన్ ద్వారా కొల్లేరులోకి చేరుతోంది. ప్రస్తుతం నల్లకోడు వద్ద నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. రోడ్డుపై నీరు రాకుండా గ్రావెల్ బస్తాలు వేసి కాల్వ గట్టును పటిష్టం చేశారు. కొల్లేరు పొంగి ప్రవహించడంతో కొల్లేరుకు పక్కనే ఉన్న కోరుకొల్లు పంచాయతీ పరిధిలోని కోరుకొల్లు, బద్రికోడు గ్రామంలోని రోడ్ల పైకి నీరు చేరింది. బద్రికోడులో 11 ఇళ్ల ఎదుట రోడ్డుపై నీరు నిలిచింది. బుధవారం ఎంపీడీఓ సీహెచ్ పద్మావతి ఆధ్వర్యంలో పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది కోరుకొల్లు, బద్రికోడును సందర్శించారు. స్థానికులను సురక్షిత ప్రాంతాలకు రావాలని అధికారులు కోరారు. ఏ సమస్య వచ్చినా తమకు సమచారం అందించాలని ఎంపీడీఓ సూచించారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని కొల్లేరు గ్రామం సాయన్నపాలెం వద్ద ఎర్రకాలువ నీరు రామన్నకోడు ద్వారా కొల్లేరులోకి నీరు చేరుతోంది. దీంతో ఆ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు.

అప్రమత్తం చేస్తున్నాం

కొల్లేరులోని నీటిమట్టం పెరుగుతున్న నేపథ్యంలో రెవెన్యూ సిబ్బంది ద్వారా కొల్లేరు తీర గ్రామాల ప్రజలను, రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. పంటకాల్వలు ఎగదన్నుండంతో పలు చోట్ల ముంపునీరు వరి పొలాల్లోకి వస్తోంది. రైతులు ఆయా చోట్ల చేలగట్లు, చెరువు గట్లు ఎత్తు చేసుకుంటున్నారు. వారికి రెవెన్యూ సిబ్బంది ద్వారా తగిన సహాయ సహకారాలు అందిస్తున్నాం.

– ఎస్ నాగరాజు, తహసీల్దార్, నిడమర్రు

బోనస్ బకాయిలు చెల్లించాలి

భీమడోలు: హైకోర్టు ఆదేశాల మేరకు బోనస్ బకాయి సొమ్ము తక్షణమే చెల్లించాలని సూరప్పగూడెం సహకార చక్కెర ఫ్యాక్టరీ విశ్రాంత ఉద్యోగులు, కార్మికులు కోరుతున్నారు. ఈ మేరకు భీమడోలులో బుధవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. సూరప్పగూడెంలోని సహకార చక్కెర ఫ్యాక్టరీని నష్టాల సాకుతో 2003 డిసెంబర్‌లో నాటి ప్రభుత్వం అమ్మేసిందని తెలిపారు. 1996 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బోనస్ నిబంధనల మేరకు అర్హత గల ఉద్యోగులు, కార్మికులను బోనస్ ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. అయితే 200-01, 2001-02, 2002-03 చెరకు బోనస్ మొత్తాలను చెల్లించలేదని తెలిపారు. ఫ్యాక్టరీ అమ్మగా వచ్చిన నిధుల నుంచి కొంత మొత్తాన్ని 2005లో హైదరాబాద్‌లోని సెక్రటేరియట్ ఎస్‌బీహెచ్‌లో డిపాజిట్ చేసిందని, ఈ మొత్తం సొమ్మును అర్హులందరికీ అందించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు. ఈ ఏడాది జనవరి 12న హైకోర్టు వారు బ్యాంకులో డిపాజిట్ బోనస్ బకాయిల మొత్తాన్ని అర్హత గల 1784 మంది రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికులకు అందజేసేలా తీర్పు నిచ్చారని రిటైర్డ్ ఉద్యోగుల ప్రతినిధి ఆర్ వెంకటాచార్యులు తెలిపారు. ఈనెల 15వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు భీమడోలులో సమావేశం నిర్వహిస్తున్నామని, ప్రతిఒక్కరూ విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ఆర్థిక సాయం

భీమడోలు: స్థానిక చినలింగంపాడు సమీపంలోని సాధుగారి దిబ్బ వద్ద నిరుపేద మహిళ గండికోట సీతమ్మ మృతి చెందడంతో బుధవారం ఎంపీటీసీ పత్తి భానులక్ష్మి, మండల జనసేన అధ్యక్షుడు పత్తి మదన్‌లు మట్టి ఖర్చులకు రూ.6 వేలు సాయం అందించారు. భీమడోలు రైల్వే గేటు యూత్ సభ్యులు ముప్పిరిశెట్టి దుర్గారావు, పెద్దిరెడ్డి ఆది, ఎన్ ప్రసాద్, వి.రాజేష్, సురేష్, టి.సాయిలు పాల్గొన్నారు.

పొదుపుతోనే కుటుంబ అభివృద్ధి



పొదుపు ఆవశ్యకతను మహిళలకు వివరిస్తున్న ప్రిన్సిపాల్ నిర్మలకుమారి

గణపవరం: జీవితంలో పొదుపు ఒక భాగం కావాలని, అప్పుడే ఆ కుటుంబం ప్రగతిపథంలో నిలుస్తుందని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. బుధవారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో నూతనంగా ప్రారంభించిన రెస్ట్ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ నెలకు సంభందించి తపాలా సేవలు – పొదుపు పథకాలు అనే అంశంపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సంపాదనలో ప్రతి ఒక్కరూ కొంతమొత్తాని పొదుపు చేయాలని సూచించారు. తాడేపల్లిగూడెం తపాలశాఖ అధికారి వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తపాలాశాఖ గ్రామీణ ప్రజలు, ముఖ్యంగా మహిళల కోసం అనేక పొదుపు పథకాలను అమలు చేస్తుందని వివరించారు. ప్రతి మహిళా పొదుపు పథకాలలో చేరాలని సూచించారు. గణపవరం తపాలా అధికారి విజయ్, వైస్ ప్రిన్సిపాల్ మధురాజు, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ సీహెచ్ చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం



పెదపాడు : గోగుంట గ్రామంలో నిత్యావసర వస్తువులు అందిస్తున్న గ్రామస్తులు

పెదపాడు : ఇటీవల కురిసిన వర్షాలకు గోగుంట గ్రామం నీట మునగడంతో నిరాశ్రయులైన కుటుంబాలకు దాతల సాయంతో వసంతవాడ గ్రామస్తులు వరద బాధితులకు చీర, పప్పులు, నూనె, బియ్యం కూరగాయాలు, మందులు అందించారు. గోగుంటలో బుధవారం 100 కుటుంబాలకు ఈ సాయం అందించారు. వసంతవాడ గ్రామానికి చెందిన ముక్కు సత్యనారాయణ (హైదరాబాదు), డాక్టర్ అక్కేన శ్రీరామ మూర్తి (విజయనగరం), సీహెచ్ రంగారావు (విజయవాడ), ఎం ఆనందరావు(విజయవాడ), జి.సుబ్రహ్మణ్యం (బెంగుళూరు), ఆర్ ఉమామహేశ్వరరావు, ఎస్ సతీష్‌కుమార్, జి.మణీందర్, రవి (గుడివాడ), గణేష్ (విజయవాడ) పద్మాకర్ (విజయవాడ), ఏసుబాబు (హైదరాబాద్), విశ్వం, అర్జునరావుల ఆర్థిక సాయం అందించారు. స్థానిక నాయకులు ముక్కు అనందరావు, గంగాడ వెంకట్రావు, ముక్కు రామచంద్రరావు, దానకర్ణ, తమలాల శ్రీనివాస్, మరడాన అప్పారావు, పరమేశ్వరరావు, అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో వలంటీర్ల సేవలు

దెందులూరు: సత్యసాయి సేవా సంస్థ తరపున దెందులూరుకు చెందిన వలంటీర్లు సుగ్గిశెట్టి నూకరాజు, సుగ్గిశెట్టి మణిగుప్త, హేమంత్, బ్రహ్మం, ప్రగళ్లపాటి ప్రకాష్‌లు విజయవాడ వెళ్లారు. ఏడు వేల కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీల బియ్యం, వాటర్ బాటిళ్లు, నిత్యావసర సరుకులు ఇచ్చామన్నారు.

నష్టపోయిన రైతులకు రుణమాఫీ చేయాలి

ఏలూరు (టూటౌన్): భారీ వర్షాలు, వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతులు, కౌలు రైతుల పంట రుణాలు మాఫీచేసి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీ ఆడిటోరియంలో జరిగిన కొల్లేరు, తమ్మిలేరు, ఉప్పుటేరు వరద సమీక్ష కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా కమిటీ తరుపున వినతి పత్రం అందించారు. అనంతరం అన్నే భవన్‌లో నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ భారీ వర్షాలకు కొల్లేరు, బుడమేరు, తమ్మిలేరు, ఎర్రకాలువ, గోదావరి వరదలు వల్ల పెదవాగు ప్రాజెక్టు, నూజివీడు పెద్ద చెరువు గండ్లు వల్ల జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. పంట నష్టాల నమోదు నిబంధనలు సవరించి పంట ఏ మేరకు నష్టం జరిగినా ఎన్యూమరేషన్ చేసి నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. నష్టాల నమోదులో కౌలు రైతుల పేర్లనే నమోదు చేయాలన్నారు. వరికి ఇన్‌పుట్ సబ్సిడీ రూ.6 వేలు నుంచి రూ.10 వేలకు పెంచినట్లు ముఖ్యమంత్రి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్టు చెప్పారు. ఉద్యాన, వాణిజ్య పంటలకు కూడా ఇన్‌పుట్ సబ్సిడీ పెంచాలని కోరారు. పంటల బీమా పరిహారం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. నష్టపరిహారం కౌలు రైతులకే అందిస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. డెల్టా ఆధునీకరణపనులు చేపట్టి పంట, మురుగు కాలువలు బాగు చేయాలని కోరారు. మిత్ర, శ్రీరామకృష్ణ కమిటీల సూచనలు మేరకు వరద నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని శ్రీనివాస్ కోరారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ వినతి



అంబేడ్కర్ విగ్రహం వద్ద వర్గీకరణకు వ్యతిరేకంగా నినదిస్తున్న ఉద్యోగులు

ఏలూరు (టూటౌన్): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలఉద్యోగులు కలెక్టర్‌కు బుధవారం వినతి పత్రం అందించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగానికి వ్యతిరేకమని పేర్కొన్నారు. దేశ వ్యాప్త ప్రతిఘటన నిరసన ఉద్యమాల్లో భాగంగా మాల ఎంప్లాయీస్ కానిస్టిట్యూషన్ ప్రొటెక్షన్ ఫోర్స్, ఏలూరు జిల్లా ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఏఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బౌద్ధ మహాసభ, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ సుదర్శనం, మాల మహానాడు అధ్యక్షుడు దాసరి రమేష్, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు టీఎస్‌డీవీ ప్రసాద్, బేతాళ నాగరాజు, పీవీ సుబ్బారావు, వెంకటేశ్వర్లు, ములగల బెన్హర్, కురమా ఆనంద్ కుమార్, గొర్రె రాజారావు, కాటం విలయమ్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలను నెరవేర్చుతాం

ఏలూరు (టూటౌన్): విద్యుత్ పోరాట అమరవీరుడు సత్తెనపల్లి రామకృష్ణ, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు సాకలి ఐలమ్మ, ప్రజా కళాకారుడు డాక్టర్ గరికపాటి రాజారావుల ఆశయాలను నెరవేర్చుతామని పలువురు నాయకులు పేర్కొన్నారు. అమర వీరుల వర్ధంతి కార్యక్రమం స్థానిక పవరుపేటలోని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. తొలుత ఆయా నాయకుల చిత్రపటాలకు పిచ్చుక ఆదిశేషు, కంది విశ్వనాథం, ఆగొల్ల వెంకటకృష్ణారావులు పూలమాలలు వేసి జోహార్లర్పించారు.

చిలకాకుపచ్చ వర్ణంలో శ్రీమన్మహా గణనాథుడు



భీమడోలు: ఆకట్టుకున్న శ్రీమన్మహా గణనాథుడు



దెందులూరు: గాలాయగూడెంలో విఘ్నేశ్వరస్వామి ఉత్సవాలు



భీమడోలు: ఆంజనేయనగరంలో పోలవరం కాల్వలో నిమజ్జనం చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

భీమడోలు: స్థానిక గణపతి సెంటర్‌లోని శ్రీమన్మహా గణనాథుని 60వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఐదో రోజు బుధవారం స్వామి వారు భక్తులకు చిలకాకుపచ్చ వర్ణంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మంగళవారం రాత్రి కూచిపూడి, భారతనాట్యం ప్రదర్శనలు నిర్వహించారు. భీమడోలు పరిసర గ్రామాల భక్తులు స్వామి వారికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. పోలసానిపల్లి శివారు ఆంజనేయనగరంలో పూజలు అందుకున్న శ్రీశ్రీశ్రీ సంపద గణపతి వినాయకుని ఓ ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగించారు. అనంతరం స్వామి వారిని పోలవరంకాల్వలో నిమజ్జనంచేశారు. స్వామి వారి నైవేద్యం లడ్డును దాత రాజు రూ.2500లకు దక్కించుకున్నారు. బుధవారం రాత్రి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా నిమజ్జనాలు

దెందులూరు: మండలంలో వినాయకుని ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బుధవారం గాలాయగూడెంలో శ్రీ విఘ్నేశ్వరస్వామి వారికి పూజలు నిర్వహించి తీన్మార్ నృత్యాలు, డీజే సౌండ్స్‌తో గ్రామస్తుల కోలాహలం నడుమ ఊరేగించారు. అనంతరం స్వామివారి ప్రతిమను నిమజ్జనం చేశారు. దెందులూరులో 10వ వార్డు యువత స్వామి ప్రతిమను ఊరేగింపుగా తీసుకెళ్లి గోదావరి కాల్వలో నిమజ్జనం చేశారు.



పెదపాడు : సత్యవోలు స్వామివారిని పూజిస్తున్న జెడ్పీ చైర్మన్ దంపతులు



దెందులూరు: గోదావరికాల్వలో వినాయకుడి నిమజ్జనం

విఘ్నేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పెదపాడు : మండలంలోని సత్యవోలు వైఎస్సార్ విగ్రహం సెంటర్‌లో విఘ్నేశ్వరస్వామిని జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు దంపతులు దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, ప్రత్యేకంగా తయారు చేసిన ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో సప్పా మురళి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు: పెదతాడేపల్లి సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి ఒంటి గంట వరకు ఉంగుటూరు, నారాయణపురం, యర్రమళ్ల, వెల్లమిల్లి, బాదంపూడి చేబ్రోలు సబ్‌స్టేషన్ల పరిధిలో గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ నటరాజన్ తెలిపారు. పరిశ్రమలు, గృహాలు, వ్యవసాయ విద్యుత్ నిలుపుద చేస్తామని పేర్కొన్నారు.

వరద బాధితులకు విరాళాలు

ఉంగుటూరు: వరద బాధితుల సహాయార్థం నియోజకవర్గంలో పలువురు విరాళాల చెక్కులను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు అందజేశారు. ఉంగుటూరులోని గ్రీన్ ఆసియా ఇంపెక్స్ ప్రైవేటు లిమిటడ్ యజమాని రూ.3లక్షల చెక్కు, ఉంగు టూరు ఏఎంసీ మాజీ చైర్మన్ పాతూరి విజయకుమార్ రూ.లక్ష నగదు, రావులపర్రుకు చెందిన తాడిశెట్టి శివప్రసాదు రూ.10 వేలు నగదు అందజేశారు.

పోతునూరు పారీస్ క్రిస్ట్‌గా జోసెఫ్ తంబి



దివ్యపూజాబలి అర్పిస్తున్న ఫాదర్లు

దెండులూరు: పోతునూరు ఆర్‌సీఎం పారీస్ క్రిస్ట్‌గా ఫాదర్ ఆర్ జోసెఫ్ తంబి నియమితులయ్యారు. ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు ఉత్తర్వులను ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ పి.బాల పోతునూరు ఆర్‌సీఎం చర్చిలో తంబికి అందజేశారు. అనంతరం కెథ్రడల్ రెక్టార్ ఐ.మైఖేల్ సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీ కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్, ఫాదర్ ఇంజేపాల్‌తో కలిపి 15 మంది ఫాదర్లు ప్రత్యేక దివ్యపూజాబలి అర్పించారు. తొలుత గ్రామంలో తంబికి ఘన స్వాగతం పలుకుతూ ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు.

అట్రాసిటీ చట్టం బలోపేతానికి కృషి

ఏలూరు (టూటౌన్): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ కోరారు. 1989 ఎస్సీ, ఎస్టీ ప్రివెన్స్ ఆఫ్ అట్రాసిటీ యాక్ట్ అమల్లోకొచ్చి 35 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్థానిక నరసింహారావుపేటలోని ఎస్సీ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర కార్యాలయంలో మాలజాతి యోధుల పోరాట సంఘం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్ర విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ అట్రాసిటీ చట్టం ఎస్సీ, ఎస్టీలకు వజ్రాయుధమని, దీని బలోపేతానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ చెప్పిన విధంగా గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. నాయకులు పల్లెం ప్రసాద్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తోకల రాజేష్, దాసరి శ్యామ్, నూకపెయ్యి కార్తీక్ పాల్గొన్నారు.

నందిగం సురేష్ సతీమణికి సంఘీభావం



గుంటూరు జైలు వద్ద సురేష్ సతీమణికి సంఘీభావం తెలుపుతున్న నాని యూత్

దెందులూరు: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ నందిగం సురేష్ సతీమణిని బుధవారం గుంటూరు జైలు వద్ద వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని యూత్ సభ్యులు కలిశారు. తమ సంఘీభావాన్ని ప్రకటించారు. అండగా ఉంటామని సురేష్ సతీమణితో తెలిపామని యూత్ సభ్యులు వివరించారు.

13న ఎస్‌జీఎఫ్ ఎంపికలు

దెందులూరు: దెందులూరు మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికలు ఈ నెల 13న స్థానిక జెడ్పీ హైస్కూల్లో నిర్వహించనున్నట్టు దెందులూరు మండల కోఆర్డినేటర్ జక్కుల సురేష్‌కుమార్ తెలిపారు. బుధవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, బ్యాడ్మింటన్ విభాగాల్లో అండర్–14, –17 బాలురు, బాలికలకు ఎంపికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మండలంలో ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, పాఠశాలల నుంచి విద్యార్థులను తీసుకురావాలని సూచించారు.